సాక్షి
పశ్చిమగోదావరి

శుక్రవారం । 21 । ఏప్రిల్ । 2023



రంజాన్ ప్రత్యేకం.. హరీరా

రంజాన్ ఉపవాస దీక్షల విరమణలో ముస్లింలు వినియోగించే హరీరా (గంజ)కి ఎంతో ప్రాధాన్యముంది.

8లో ▸



అమావాస్య ఎఫెక్ట్

ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంపై అమావాస్య ప్రభావం పడింది. భక్తులు నామ మాత్రంగా సందర్శించారు.

8లో ▸

కూలీ దుర్మరణం

ద్వారకాతిరుమల మండలం గుణ్ణంపల్లి వద్ద జాతీయ రహదారి పై జరిగిన రోడ్డు ప్రమాదంలో తాపీ కూలీ దుర్మరణం చెందాడు.



8లో

ఇఫ్తార్
శుక్రవారం సాయంత్రం
భీమవరం 6.27
తాడేపల్లిగూడెం 6.29
నరసాపురం 6.27

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

పోలీసులకు వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢత్వం కలిగి సక్రమంగా విధులు నిర్వహించగలరని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. స్థానిక వర్మ ఆస్పత్రిలో గురువారం మూడోవిడత ఏర్పాటుచేసిన ఆరోగ్య శిబిరం వద్ద ఆయన మాట్లాడారు. పోలీసులు వాతావరణంతో సంబంధం లేకుండా విధులు నిర్వహించాల్సి ఉంటుందని, ఈ సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరి అన్నారు. ఈ మేరకు సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు మాస్టర్ హెల్త్ చెకప్ ప్రోగ్రామ్ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రిలో ఉచితంగా ఆరోగ్యపరీక్షలు నిర్వహించి మందులు కూడా అందిస్తున్నామన్నారు. మూడో విడతలో 166 మంది తల్లిదండ్రులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. మొత్తంగా 870 మంది పాల్గొన్నారన్నారు. పోలీసు సిబ్బందికి సత్వర వైద్యం అందించడానికి భీమవరంలో పోలీస్ యూనిట్ ఆస్పత్రి ఏర్పాటుచేయాలన్నారు. పోలీసుల ఆరోగ్య పరీక్షలు, వైద్య సదుపాయాలకు సహకరించిన వర్మ ఆస్పత్రి వైద్యులు పీఆర్‌కే వర్మ, గాంధీరాజు, ఆర్‌వీ రమణకుమార్, సిబ్బందిని అభినందించారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) ఏవీ సుబ్బరాజు, సెబ్ అదనపు ఎస్పీ ఏటీవీ రవికుమార్, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, ఆర్ఐ అడ్మిన్ శ్రీకాంత్, ఆర్ఐ ఎంటీఓ వెంకట్రావు, వన్‌టౌన్ సీఐ అడబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'పది' మూల్యాంకనం

వీరవాసరం: స్థానిక ఎమ్మార్కే జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ప్రశాంతంగా జరుగుతుందని డీఈఓ వెంకటరమణ గురువారం తెలిపారు. పటిష్ట బందోబస్తు మధ్య మూడు గదుల్లో మూల్యాంకనం చేస్తున్నారని, 805 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారన్నారు. ఈనెల 26 వరకు రెగ్యులర్ విద్యార్థుల జవాబుపత్రాలు, 26 నుంచి 30వ తేదీ వరకూ ఓపెన్ స్కూల్ విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనం నిర్వహిస్తామన్నారు. ఉపాధ్యాయులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామరాజు



శ్రీరామరాజు

పాలకొల్లు సెంట్రల్: రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మూడో పర్యాయం సామంతపూడి శ్రీరామరాజును గురువారం భీమవరం రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కొత్త వెంకట శ్రీరామనారాయణ (శ్రీనివాస్), సహాయ కార్యదర్శి పేరూరి వెంకట సత్యనారాయణ రాధాకృష్ణ, కోశాధికారి పెరుమాళ్ల వెంకట శ్రీహరినాథ్‌లతో పాటు మరికొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

సాహిత్య పురస్కారానికి శ్రీహరి కోటి ఎంపిక

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హైదరాబాద్‌కు చెందిన తెలుగు వెలుగు సాహిత్య వేదిక, ఎస్వీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యం ప్రదానం చేసే జాతీయ సాహిత్య పురస్కారానికి ఏలూరుకు చెందిన కవి, రచయిత, గాయకుడు, అవార్డీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీహరి కోటి ఎంపికయ్యారని ఆ సంస్థ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 30న హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఆయనకు పురస్కారం అందిస్తామని పేర్కొన్నారు. శ్రీహరికోటి పంపిన కవితను జాతీయ సాహిత్య సంబరాల సందర్భంగా ప్రచురించి ఆ రోజున ఆవిష్కరించనున్న కవితా సంకలనంలో ప్రచురించడంతో పాటు ఉత్తమ కవిగా, రచయితగా ఎంపిక చేసి జాతీయ సాహిత్య పురస్కారంతో సత్కరిస్తామని తెలిపారు.

సర్వేజనా సుఖినోభవంతు

జగనన్న భూహక్కు.. భూరక్ష
- ఉమ్మడి జిల్లాలో వేగంగా రీసర్వే
- భూవివాదాలకు శాశ్వత చెక్
- మొదటి విడతలో 97 గ్రామాల్లో పూర్తి
- ముమ్మరంగా రెండో విడత పనులు



రీ సర్వేలో భాగంగా స్టోన్ ప్లాంటేషన్ పనులను పరిశీలిస్తున్న జేసీ లావణ్యవేణి

సాక్షి ప్రతినిధి,ఏలూరు: ఏళ్ల నాటి భూసమస్యలకు పరిష్కారం లభిస్తోంది.. ప్రజల దశాబ్దాల కల సాకారమవుతోంది.. గతంలో ఎన్నడూలేని విధంగా భూముల రీసర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టగా పారదర్శకంగా కార్యక్రమం కొనసాగుతోంది. భూవివాదాలు తరచూ వస్తున్న నేపథ్యంలో వాటి శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనిలో భాగంగా వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష పథకం ద్వారా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా భూములన్నింటినీ రీసర్వే చేస్తున్నారు. ఇప్పటికే తొలిదశ సర్వే పూర్తి కాగా రెండో విడత పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పకడ్బందీగా..

భూసర్వేను పకడ్బందీగా నిర్వహిస్తూ, ప్రభుత్వ భూములు, నివాస గృహాలు, ప్రైవేట్ భూములు ఇలా ప్రతి గ్రామానికి సంబంధించిన వివరాలను కొలతలతో సహా నిర్ధారిస్తున్నారు. మొత్తం విస్తీర్ణాన్ని సర్వే చేసి తొలుత హద్దుల ట్రీటింగ్, గ్రౌండ్ వాల్యూయేషన్ పూర్తి చేస్తున్నారు. సర్వే చేస్తున్న గ్రామాల్లో గ్రామ సచివాలయాల సర్వేయర్లు, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది ప్రతి గట్టూ తిరుగుతూ హద్దులను నిర్ధారిస్తున్నారు. దీంతో సర్వే నిర్వహించేందుకు సమయం ఎక్కువ తీసుకున్నప్పటికీ సరైన రీతిలో హద్దులు నిర్ణయిస్తూ ముందుకు సాగుతున్నారు.

ఆధునిక సాంకేతికతతో.. రీసర్వేలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. కంటిన్యూస్ ఆపరేటింగ్ రిఫరింగ్ స్టేషన్ నెట్‌వర్క్ సాంకేతిక సహాయంతో ప్రక్రియను కొనసాగిస్తున్నారు. చిన్నపాటి భూముల నుంచి పెద్ద కమతాల వరకూ అన్నింటినీ నమోదు చేస్తున్నారు. డ్రోన్లను ఉపయోగించి పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నారు. సర్వే సమయంలో సరిహద్దు రైతులను పిలిపించి వారి సమక్షంలోనే సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఇప్పటివరకూ 1906లో జరిగిన సర్వేను ప్రామాణికంగా తీసుకోగా.. ఇన్నేళ్లకు మరోమారు ప్రభుత్వం రీసర్వే చేస్తోంది.

ఏలూరు జిల్లాలో..

ఏలూరు జిల్లాలో 14,58,915.52 ఎకరాల భూమి 660 గ్రామాల్లో విస్తరించి ఉంది. మొదటి విడతలో 81 గ్రామాల పరిధిలో 89,635.59 ఎకరాల్లో సర్వే పూర్తిచేశారు. అలాగే 87,849 సరిహద్దు రాళ్లను సిద్ధం చేసి 60 శాతానికిపైగా స్టోన్ ప్లాంటేషన్ పనులు పూర్తిచేశారు. రెండో దశలో 87 గ్రామాల పరిధిలో 1,51,728.37 ఎకరాల విస్తీర్ణంలో సర్వే చేయాలని నిర్ణయించి ఇప్పటివరకూ 23 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తిచేశారు.

పశ్చిమగోదావరి జిల్లాలో..

పశ్చిమగోదావరి జిల్లాలో 298 రెవెన్యూ గ్రామాల పరిధిలో 5,35,843.32 ఎకరాల భూమి ఉంది. దీనిలో మొదటి విడతలో 16 గ్రామాల పరిధిలో 9,412 ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు. అలాగే 19,928 సరిహద్దు రాళ్లను దిగుమతి చేసుకుని 60 శాతం పైగా విస్తీర్ణంలో స్టోన్ ప్లాంటేషన్ పనులు పూర్తిచేశారు. రెండో విడతలో 282 గ్రామాల పరిధిలో 5,26,431 ఎకరాల విస్తీర్ణంలో సర్వే చేయాలని నిర్ణయించి ఇప్పటివరకూ 21 గ్రామాల్లో సర్వే ప్రక్రియ పూర్తి చేశారు.

సమస్యలకు మోక్షం



దశాబ్దాల నాటి సమస్యలకు రీసర్వేతో మోక్షం కలగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రీసర్వేను చేపట్టి ఎటువంటి వివాదాలు లేని భూములను రైతులకు, భూయజమానులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంది. ఇప్పటికే మొదటి విడత సర్వే ప్రక్రియను పూర్తి చేసి రెండో విడత ప్రారంభించాం.

– బి.లావణ్యవేణి, జాయింట్ కలెక్టర్, ఏలూరు జిల్లా

298 గ్రామాల్లో..



పశ్చిమగోదావరి జిల్లాలోని 298 రెవెన్యూ గ్రామాల పరిధిలో భూసర్వేను వేగంగా చేపట్టేందుకు చర్యలు తీసుకున్నాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి తొలి ప్రాధాన్యమిస్తున్నాం. భూయజమానులకు వివాదాలు లేని భూములను అందించేందుకు కృషి చేస్తున్నాం.

– ఎస్.రామసుందర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్, పశ్చిమగోదావరి జిల్లా

పూర్తిస్థాయిలో తాగునీటి సరఫరా

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

తాడేపల్లిగూడెం అర్బన్: నియోజకవర్గంలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక పంపుల చెరువును గురువారం పరిశీలించిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అమృత్ పథకంలో భాగంగా అన్ని వార్డుల్లో నూతన పైపులను ఏర్పాటుచేశామన్నారు. తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. జువ్వలపాలెం, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో పైపుల ఏర్పాటు, కుళాయి కనెక్షన్ల వివరాలను తెలుసుకున్నారు. రెండో సమ్మర్ స్టోరేజీ నిర్మాణానికి రీటెండరింగ్‌కు చర్యలు చేపట్టాలని మున్సిపల్ ఇంజినీర్ మురళీకృష్ణకు సూచించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో రూ.3.65 కోట్ల వ్యయంతో వెయ్యి కిలోలీటర్ల సామర్థ్యం గల రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నట్టు చెప్పారు. పంపుల చెరువు వద్ద 11 మిలియన్ లీటర్ల నీటిశుద్ధికి రూ.5 కోట్ల వ్యయంతో ఫిల్టర్‌బెడ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. విలీన గ్రామాలైన కుంచనపల్లి, ప్రత్తిపాడు, ఎల్.అగ్రహారం, పడాలకు మున్సిపల్ మంచినీటిని సరఫరా చేస్తామన్నారు. ప్రభుత్వ పనులు చేసిన కాంట్రాక్టర్లకు నెలాఖరున సొమ్ములు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగిరపర్చాలి

జేసీ రామసుందర్‌రెడ్డి



జగనన్న లేఅవుట్‌ను పరిశీలిస్తున్న జేసీ

పాలకొల్లు అర్బన్: జిల్లావ్యాప్తంగా జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాన్ని వేగిరపర్చాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని దగ్గులూరులో జగనన్న లేఅవుట్‌ను ఆయన పరిశీలించారు. ఎన్ని ఇళ్లు పూర్తి చేశారని హౌసింగ్ డీఈ రామాయణం త్రిమూర్తులును ప్రశ్నించారు. శివదేవునిచిక్కాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి లోటుపాట్లు లేకుండా సకాలంలో రైతులకు గోనె సంచులు అందజేయాలని సూచించారు. ఆర్‌బీకే సిబ్బంది ఇచ్చిన సమయం ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రవాణా, గోనె సంచులు, హమాలీలను రైతులు భరిస్తే వారి ఖాతాలకు చార్జీలను జమచేస్తామన్నారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు, వ్యవసాయాధికారి షేక్ అబ్దుల్ రహీం ఉన్నారు.

అవినీతిరహిత పాలనే సీఎం లక్ష్యం

- జాతిపిత కలల్ని నెరవేరుస్తున్న సీఎం జగన్
- రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



పెదకాపవరంలో భూమి పూజ చేసి మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, చిత్రంలో చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు



కలగంపూడి సభలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్, చిత్రంలో చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు, జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్

ఆకివీడు : ఇంటి వద్దకే ప్రభుత్వ పథకాలు అందిస్తూ అవినీతిరహిత పాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు అందిస్తున్నారని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీ కన్న కలల్ని సీఎం జగన్ నెరవేరుస్తున్నారని ఆయన చెప్పారు. గురువారం ఆకివీడు, పాలకోడేరు, పాలకొల్లు, యలమంచిలి మండలాల్లో పలు శంకుస్థాపన, అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు చేపట్టిన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడారు. జగనన్న వచ్చిన తర్వాతే ఈ పథకాలన్నీ వస్తున్నాయని ప్రజల నుద్దేశించి చెప్పారు. పింఛన్ల సొమ్ము, ఆసరా, చేయూత, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి, నాడు–నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, పేదలకు సొంతి కల సాకారం ఇవన్నీ సీఎం జగన్ వచ్చాకే అమలవుతున్నాయని గుర్తుచేశారు. సచివాలయాల ఏర్పాటు ద్వారా గ్రామాల్లోనే ప్రభుత్వ పాలన ఉందని, వాటిలో 10 మందికి పైగా ఉద్యోగులను ఏర్పాటు చేశారని, వారు నిరంతరం ప్రజల సమస్యల పరిష్కారం కృషిచేస్తున్నారని మంత్రి వివరించారు. ప్రజలంతా సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లోనూ మద్దతు పలకాలని కోరారు.

ఘన స్వాగతం

ఉప్పుటేరు వంతెన వద్ద మంత్రికి ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మోటారు సైకిల్ ర్యాలీతో మంత్రి కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని జగనన్న కాలనీని సందర్శించారు. అనంతరం కోళ్లపర్రులో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. పెదకాపవరం ప్రాంతంలో రూ.47.50 కోట్లతో నిర్మించనున్న రెండు రహదారుల నిర్మాణానికి ఆయన భూమి పూజ చేశారు. డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు మాట్లాడుతూ ఇంటి స్థలం మంజూరు కానివారు ఆందోళన చెందాల్సిన పనిలేదని, మరలా దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేస్తారని, పథకాలపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ తాళ్లకోడు లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం వేగంగా జరగడానికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి కృషి ఉందని ప్రశంసించారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, ఎమ్మెల్యే మంతెన రామరాజు, జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, గౌడ కార్పొరేషన్ చైర్మన్ మేకా పార్వతి, పాతపాటి వెంకట శ్రీనివాస రాజు, ఇందుకూరి మోహనరాజు, త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ తదితరులు పాల్గొన్నారు.

విస్సాకోడేరులో సచివాలయం ప్రారంభం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరులో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. సచివాలయం సమీపంలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలగంపూడిలో అభివృద్ధి పనులు

యలమంచిలి: దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కిందని మంత్రి జోగి రమేష్ అన్నారు. కలగంపూడిలో సుమారు రూ.కోటితో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లను జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి కవురు శ్రీనివాస్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు.

వంతెన ప్రారంభం

పాలకొల్లు అర్బన్: సగంచెరువులో రూ.10 కోట్లతో నిర్మించిన వంతెనను మంత్రి రమేష్ ప్రారంభించారు. పూలపల్లి వైఎస్సార్ జంక్షన్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● చల్లని పందిరి



వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు కలెక్టర్ పి.ప్రశాంతి సూచనల మేరకు భీమవరంలో అధికారులు వినూత్నంగా నేలపై గ్రీన్‌మ్యాట్, చలువ పందిరి ఏర్పాటుచేస్తున్నారు. పట్టణంలోని బుధవారం మార్కెట్ వద్ద పీపీ రోడ్డుపై కొన్ని మీటర్ల మేర ఇలా గ్రీన్‌మ్యాట్ వేశారు. ఇటుగా వెళుతున్న ప్రయాణికులు చల్లటి అనుభూతి పొందుతున్నారు. - భీమవరం (ప్రకాశంచౌక్)

● మంచు రహదారి



వేసవిలోనూ వేకువజామున దట్టమైన పొగమంచు కురిసింది. ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించనంతగా కమ్ముకున్న పొగమంచు మాటున ప్రజలు రాకపోకలు సాగించారు. దారంతా మంచు దుప్పటి కప్పేయడంతో వాహనాలు నెమ్మదిగా ముందుకు సాగాయి. తణుకు–దువ్వ జాతీయ రహదారిపై గురువారం వేకువజామున కనిపించిన దృశ్యమిది. - తణుకు టౌన్

జెడ్పీ సిబ్బంది సంక్షేమానికి కృషి

జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్



జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జిల్లాపరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, చిత్రంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): జిల్లా ప్రజాపరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న సిబ్బంది అకాల మరణం చెందితే ఉద్యోగి కుటుంబానికి రూ.5 లక్షలు బీమా కింద ఆర్థిక సాయం అందించాలని సమావేశం తీర్మానించిందని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో గురువారం ఆయన అధ్యక్షతన జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తాగునీరు, గృహనిర్మాణం, ఉపాధి హామీ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకునేందుకు జెడ్పీ సాధారణ నిధుల నుంచి వార్షికంగా రూ.15 లక్షలను ఇన్సూరెన్స్ కంపెనీకి చెల్లించేందుకు సమావేశం ఆమోదించిందన్నారు. జెడ్పీ కార్యాలయం నుంచి గ్రామ పంచాయతీ పింఛనుదారులు 230 మందికి, జెడ్పీ పింఛనుదారులు 26 మందికి పింఛన్ చెల్లింపు నిమిత్తం రూ.6 కోట్ల నిధుల కేటాయింపునకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పింఛనుదారులకు పీఆర్‌సీ 2015, 2022 అమలు చేయాలని నిర్ణయించామన్నారు. ఏరియర్స్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు రాగానే చెల్లిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లాస్థాయి భవనం నిర్వహణ, తదితర ఖర్చుల కోసం సదరు భవనం గ్రౌండ్ ఫ్లోర్ అద్దెకు ఇచ్చేందుకు అనుమతిచ్చామన్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ నాడు–నేడు పనులు, మధ్యాహ్న భోజన పథకం అమలు, అంగన్‌వాడీ నిర్వహణపై జెడ్పీటీసీ, ఎంపీపీ, తహసీల్దార్, ఎంపీడీఓతో కూడిన బృందం ఆకస్మిక తనిఖీలు చేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలులో భాగంగా ఎకరాకు 92 గోనె సంచులు అందిస్తామన్నారు. రైతుల నుంచి ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరిస్తామన్నారు. చలివేంద్రాల ఏర్పాటుకు ప్రజాప్రతినిధులు కూడా చొరవ తీసుకోవాలన్నారు. భూముల రీసర్వేను విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలో గృహ నిర్మాణ ప్రగతి బాగుందన్నారు. ఎమ్మెల్యేలు వీఆర్ ఎలీజా, తలారి వెంకట్రావు, ఎమ్మెల్సీలు జయమంగళ వెంకటరమణ, షేక్ సాబ్జి, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, జెడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిల బదిలీలు

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో 13 మంది జూనియర్ సివిల్ జడ్జిలను బదిలీ చేస్తూ గురువారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.
- తణుకు పీజేసీజే పి.బాబును రాజమహేంద్రవరం 7వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నూజివీడు 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి రానున్నారు.
- తాడేపల్లిగూడెం 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సి.రమ్యను రాజమహేంద్రవరం 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో బాపట్ల పీజేసీజే ఈ.అన్నామణి రానున్నారు.
- పాలకొల్లులో పీజేసీజే ఎస్.ఉషా లక్ష్మీకుమారి కాకినాడ ఎక్సైజ్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రాజమహేంద్రవరం నుంచి ఎస్.వరలక్ష్మి రానున్నారు.
- తాడేపల్లిగూడెం పీజేసీజే ఎ.నాగమల్లేశ్వరి కాకినాడ ఎక్సైజ్ కోర్టుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కొత్తవలస నుంచి ఎస్.సూర్యకిరణ్‌శ్రీ రానున్నారు.
- నరసాపురం పీజేసీజే బి.గౌరీశంకర్ అమలాపురం బదిలీ అయ్యారు.
- పాలకొల్లులో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.భానుసాయి ఒంగోలుకు బదిలీ అయ్యారు.
- భీమవరం 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.పవన్‌కుమార్ అక్కడే పీజేసీజేగా నియమితులయ్యారు. ఆ స్థానంలో రాజోలు నుంచి జి.సురేష్ బాబు రానున్నారు.

క్లుప్తంగా

కారు ఢీకొని తాపీ కూలీ దుర్మరణం



గుణ్ణంపల్లి వద్ద హైవేపై ప్రమాదం దృశ్యం

ద్వారకాతిరుమల: గుణ్ణంపల్లి వద్ద జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ తాపీ కూలీ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఉంగుటూరు మండలం అక్కుపల్లి గోకవరానికి చెందిన దేవదాసు మురళీ (46) తాపీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గురువారం ఉదయం నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంకు పని నిమిత్తం తన స్కూటీపై వెళుతున్నాడు. ఈ క్రమంలో గుణ్ణంపల్లి జాతీయ రహదారిపై డైవర్షన్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న మురళీ స్కూటీని, రాజమండ్రి నుంచి ఏలూరు వైపు వెళుతున్న ఒక మారుతీ కారు వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలైన మురళీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు దేవదాసు సుబ్బారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై టి.సుధీర్ చెప్పారు.

దూరవిద్య ప్రయోగ పరీక్షలకు 446 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం నిర్వహించిన భౌతికశాస్త్ర ప్రయోగ పరీక్షకు 200 మందికి గాను 168 మంది పాల్గొనగా 32 మంది గైర్హాజరయ్యారు. రసాయన శాస్త్రం పరీక్షకు 180 మందికి గాను 158 మంది హాజరు కాగా, 22 మంది గైర్హాజరయ్యారు. అలాగే జీవశాస్త్రం పరీక్షకు 139 మందికి గాను 120 మంది హాజరు కాగా, 19 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలో డీఈసీ కమిటీ ప్రతినిధులు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్‌వీ రవిసాగర్ తెలిపారు.

రంజాన్ ప్రత్యేకం.. హరీరా

● హైదరాబాద్ హలీమ్‌కు దీటుగా రుచి ● 65 ఏళ్లుగా అలరిస్తున్న ఆహార పానీయం ● 20 బలవర్ధక పోషక పదార్థాలతో తయారీ

ముస్లింలకు పవిత్రమైన రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష విరమణలో వినియోగించే హరీరా (గంజి)కి ఎంతో విశిష్టత ఉంది. జిల్లాలో గత 65 ఏళ్లుగా చింతలపూడిలో లభించే హరీరాకు ఇక్కడ ప్రత్యేక స్థానం ఉంది. రుచికరంగా ఉండే ఈ ఆహార పానీయాన్ని సేవించడం కోసం దూరప్రాంతాల నుంచి కూడా ముస్లింలు రంజాన్ మాసంలో ఇక్కడకు వస్తుంటారు.



చింతలపూడిలో హరీరా తయారీలో నిమగ్నమైన దృశ్యం



హరీరాలో వినియోగించే ప్రధాన ఆహార పదార్థాలు

చింతలపూడి: ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు ఆచరించే ఇస్లాం మార్గదర్శకాల్లో రంజాన్ ఉపవాసాలకు అత్యంత ప్రాధాన్యత ఉంది. రంజాన్ నెలలో 30 రోజుల పాటు కఠోర ఉపవాసాలు ఆచరించడంతో పాటు ఐదు పూటలా ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. నెలవంక దర్శనంతో మరుసటి రోజు నుంచి ప్రారంభమయ్యే రోజు (ఉపవాసాలు) షవ్వాల్ నెలవంక దర్శనంతో ముగుస్తాయి. ప్రతి ముస్లిం నమాజుతో పాటు తప్పనిసరిగా ఉపవాసాలు పాటించాలని ఇస్లాం సూచిస్తోంది. తెల్లవారుజాము ముందు నుంచే ఉపవాస దీక్ష (సహర్) ప్రారంభమవుతుంది. సూర్యాస్తమయం సమయం (ఇఫ్తార్) వరకు పాటిస్తారు. పగటి సమయమంతా అన్నపానీయాలు, ఆహార పదార్థాలు తీసుకోరు. సాయంత్రం ఇఫ్తార్‌తో దీక్ష విరమిస్తారు. పగలంతా ఉపవాసం పాటించిన దీక్షా పరులు సాయంత్రం నిర్ణీత వేళలో పండ్లు, ఫలహారాలతో దీక్ష విరమిస్తారు. ఈ సందర్భంగా ఇఫ్తార్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తారు. ఉమ్మడిగా కూర్చుని ఉపవాసాన్ని విరమిస్తారు. ఖర్జూరపు పండ్లు, హలీం, హరీరా వంటి ప్రత్యేక పదార్థాలతో ఉపవాస దీక్ష విరమణ చేస్తారు.

అప్పట్లో తయారీకి రూ.3 ఖర్చు

65 ఏళ్ల క్రితం రోజుకు 3 రూపాయలతో అప్పటి జమాతె ఇస్లామి హింద్ నాయకులు బషార్‌తుల్లా హరీరా తయారు చేసేవారని ప్రస్తుతం హరీరా తయారు చేస్తున్న అంజుమన్ మహాఫిజుల్ ఇస్లాం కమిటీ నాయకులు ఎండీ ఇస్మాయిల్ చెబుతున్నారు. ప్రస్తుతం రూ.5 వేలకు పైగా ఖర్చు అవుతోందని అంటున్నారు.

హరీరా తయారీలో..

హరీరా తయారీలో సుమారు 20 రకాల పోషక పదార్థాలను వినియోగిస్తారు. బియ్యం రవ్వ, మటన్ ఖైమా, వేరుశనగ నూనె, డాల్డా, అల్లం, వెల్లుల్లి, కొబ్బరి, పొదీన, కొత్తిమీర, కరివేపాకు, ఉల్లిపాయలు, టమాటా, లవంగాలు, దాల్చిన చెక్క, పెసర పప్పు, కారం, పసుపు, జీలకర్ర, ఇలాచి ఇలా రకరకాల వస్తువులతో హరీరా తయారు చేస్తారు. అనేక రకాల సుగంధ ద్రవ్యాలను వేసి తయారు చేయడం వల్ల ఇది హైదరాబాద్ హలీంకు ఏమాత్రం తీసిపోకుండా రుచికరంగా ఉంటుంది.

బలంతో పాటు ఆరోగ్యం..

హరీరా (గంజి) బలవర్ధకమైన ఆహార పానీయం. రకరకాల సుగంధ ద్రవ్యాలు, రవ్వ, మటన్ ఖైమాతో తయారు చేయడం కారణంగా నెలరోజుల పాటు దీన్ని సేవించిన ఉపవాస దీక్షా పరులకు బలం చేకూరడమే కాక, ఆరోగ్యవంతంగా కూడా ఉంటారని ఇక్కడి ముస్లింలు చెబుతున్నారు. హిందువులు కూడా ఈ హరీరాను సేవించడానికి వస్తుండటం విశేషం.



ఇఫ్తార్ ఉపవాస విరమణ సమయంలో హరీరాను సేవిస్తున్న దీక్షాపరులు

ఆరు దశాబ్దాల నుంచి..



చింతలపూడి హరీరా ఆరు దశాబ్దాలుగా ఈ ప్రాంత ముస్లింలను అలరిస్తోంది. రంజాన్ నెల వచ్చిందంటే నెల రోజుల పాటు హరీరాను తాగేందుకు ఎక్కువగా ఇష్టపడతారు. ఆరోగ్య పరంగా కూడా మంచి ఆహారం.

– సయ్యద్ రహీం (బాబు), జామియ మస్జిద్ కమిటీ అధ్యక్షులు

హరీరా సేవించి దీక్ష విరమిస్తారు



ఈ ప్రాంతంలో ముస్లింలు తప్పనిసరిగా హరీరా సేవించి ఉపవాస దీక్షను విరమిస్తారు. ఇది రుచికరంగా ఉండటమే కాక పగలంతా ఉపవాసంతో ఉన్న వారికి శక్తిని ఇచ్చే ఔషధంగానూ పనిచేస్తుంది.

– ఎండీ జిలాని, జామియ మస్జిద్ కమిటీ కార్యదర్శి

ఎమ్మెల్సీగా అవకాశం.. అదృష్టంగా భావిస్తున్నా

● జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్
● జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఘన సన్మానం



జెడ్పీ ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): శాసనమండలి సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్‌ను గురువారం పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, జెడ్పీ సిబ్బంది సత్కరించారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో గురువారం జరిగిన జెడ్పీ సర్వసభ్య సమావేశంలో కవురు శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్ శాలువతో సత్కరించి మెమెంటో అందజేశారు. అదే విధంగా శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జి, జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యేలు తలారి వెంకట్రావు, వీఆర్ ఎలీజా తదితరులు శ్రీనివాస్‌ను శాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం జిల్లా శాఖ ప్రతినిధులు, జెడ్పీ కార్యాలయ అధికారులు, సిబ్బంది సత్కరించినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి, తనకు సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంటు సభ్యులు, శాసనమండలి సభ్యులు, శాసనసభ్యులు, జెడ్పీటీసీ సభ్యులు అందరి సహకారం, ఆశీస్సులతో ఒక అన్నగా, తమ్ముడిగా ఆదరించి జిల్లాను అన్నివిధాలా ముందుకు నడిపించడం జరిగిందన్నారు. జిల్లా పరిషత్‌కు సంబంధించి ప్రతి జెడ్పీటీసీ సభ్యుడికి దాదాపు కోటి రూపాయలు నిధులు కేటాయించడం, ఆ నిధులతో గ్రామాల్లో తాగునీరు, డ్రెయినేజీ, రోడ్లు తదితర సమస్యలను పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ ఏడాదిన్నర కాలంలో ముఖ్యంగా జెడ్పీటీసీ సభ్యులు అందరూ తనను ఒక కుటుంబ సభ్యునిగా ఆదరించారన్నారు. తాను చేపట్టిన కార్యక్రమాల్లో భాగస్వాములై వారి సొంతకార్యక్రమంగా చేసి ముందుకు నడిపించారన్నారు. ఈ ఏడాదిన్నర కాలంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు రూ.75 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో జెడ్పీ చైర్మన్‌గా పనిచేసి వారి మార్గదర్శకంలో ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.

శ్రీవారి క్షేత్రంపై అమావాస్య ప్రభావం



ఖాళీగా ఉన్న ఆలయ అనివేటి మండప ప్రాంతం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయంపై గురువారం అమావాస్య ఎఫెక్ట్ పడింది. నిత్యం భక్తులతో రద్దీగా ఉండే ఆలయ పరిసరాలు నామమాత్రపు భక్తులతో దర్శనమిచ్చాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వల్ప సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించారు. దీంతో ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, దర్శనం క్యూలైన్లు, అనివేటి మండపం, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కేశఖండనశాల ఇతర విభాగాలు దాదాపు ఖాళీగా కనిపించాయి. మధ్యాహ్నం నుంచి క్షేత్ర పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి.

బీఎస్ఎన్ఎల్ స్థలం అమ్మకానికి బిడ్ల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): బీఎస్ఎన్ఎల్ స్థలం విక్రయానికి ఈ వేలం ద్వారా బిడ్లు ఆహ్వానిస్తున్నట్లు జీఎం ఐ.శ్రీను గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో గల బిఎస్ఎన్ఎల్ స్టోర్ యార్డ్ స్థలం 12,342 చదరపు గజాల స్థలం అమ్మకానికి ఈ వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మే 9 నుంచి 23వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకు బిడ్‌ల సమర్పించవచ్చన్నారు. వచ్చిన బిడ్లను మే 24వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు తెరుస్తామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం 94406 88555, 94901 22622 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ప్రభుత్వం చొరవతో ఏళ్ల తరబడి నిరీక్షణ తరువాత ఉద్యోగాలు పొందిన 1998 డీఎస్సీ అభ్యర్థులు గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 254 మందికి ఉద్యోగాలు లభించగా, వారిలో మండలం నుంచి ఏడుగురికి వచ్చాయి. ఏడుగురి సర్టిఫికెట్లను గురువారం ఇన్‌చార్జి ఎంఈవో ఎం.సుభాకరరావు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వీరంతా తమకు ఉద్యోగాలు ఇచ్చినందుకు కృతజ్ఞతగా ఎంపీపీ రావూరి వెంకటరమణ చేతుల మీదుగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మేడపాడు ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ గుర్రాల వెంకట్రావు, రిటైర్డ్ హెచ్ఎం దేగల వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అడిదెల ప్రభాకర ప్రేమ్‌కుమార్, కోనా ఏసురత్నం పాల్గొన్నారు.

– యలమంచిలి

కట్నం వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వరకట్న వేధింపులపై వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కర్రెద్దుల భవానీని సవలవరపు వాసుదేవ విజయ్‌సాయి కుమార్ అలియాస్ వాసు ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే వాసు కుటుంబసభ్యులు భవానీని కులంపేరుతో దూషించి, వాసును వారి వెంట తీసుకువెళ్లారని, దీంతో భవానీ పుట్టింటికి వచ్చిందన్నారు. వాసును కాపురానికి తీసుకు వెళ్లాలని కోరగా, వాసు కూడా భవానీని కులం పేరుతో దూషించడంతో పాటు, అదనంగా కట్నం తీసుకురావాలని కుటుంబ సభ్యులతో కలిసి వేధిస్తున్నాడన్నారు. ఆ మేరకు భవానీ ఫిర్యాదుతో వాసు, అతని కుటుంబసభ్యులు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రొయ్యల సాగులో నష్టాలు వచ్చాయని..

భీమవరం అర్బన్: రొయ్యల సాగులో నష్టాలు రావడంతో మనస్తాపంతో ఓ వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం మండలంలోని దెయ్యాలతిప్ప గ్రామానికి చెందిన బొమ్మిడి శివకృష్ణ (32) వనామీ రొయ్యల పెంపకం చేస్తున్నాడు. రొయ్యపిల్ల వేసిన ప్రతిసారీ వైరస్ వచ్చి నష్టాలు వచ్చాయి. దీంతో అందినకాడికల్లా అప్పులు చేశాడు. అప్పులు ఎక్కువై తీర్చే మార్గం కానరాక గురువారం శివకృష్ణ రొయ్యల చెరువులో ఉపయోగించే పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సోదరుడు బొమ్మిడి బండిరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై డి.మోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి స్వాధీనం.. ముగ్గురిపై కేసు నమోదు

పాలకోడేరు: పాలకోడేరులోని యనమదుర్రు కాలువ గట్టును చేర్చి ఉన్న గేదెల పాక వద్ద సుమారు ఐదు కేజీల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు పోలీసులు గురువారం తెలిపారు. గ్రామంలోని గేదెల పాక వద్ద గురువారం ఆకివీడు మండలం గుమ్మలూరుకు చెందిన మద్దా అహరోను, కాళ్ల మండలం ఏలూరుపాడుకు చెందిన వాగిరి సాలేమురాజు, ఆకివీడుకు చెందిన మరో బాలుడుతో కలిసి గంజాయి అమ్ముతుండగా డిప్యూటీ తహసీల్దార్ శివరామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్సై నాళం శ్రీనివాసరావు, సిబ్బందితో దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందని చెప్పారు.

సారా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసుల నమోదు

టి.నరసాపురం : నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపుగుంట, మెట్టగూడెం గ్రామాల్లో దాడులు నిర్వహించగా, నాటు సారా విక్రయిస్తున్న ఏపుగుంట గ్రామానికి చెందిన వీరంకి వెంకటరమణను అరెస్టు చేసి అతని నుంచి ఐదు లీటర్ల సారా, మెట్టగూడెం గ్రామంలో పల్లగాని శ్రీదేవి అరెస్టు చేసి, ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరిని చింతలపూడి కోర్టులో హాజరు పరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై చెప్పారు.

ఉపాధ్యాయుడిపై దాడి కేసులో నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేవీ సత్యనారాయణ, సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు

చింతలపూడి: పట్టణంలోని శశి పాఠశాలలో విద్యార్థిని ఉపాధ్యాయుడు కొట్టిన సంఘటనలో ఉపాధ్యాయుడిపై దాడి చేసి గాయపరిచిన నలుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు జంగారెడ్డిగూడెం డీఎస్పీ కేవీ సత్యనారాయణ చెప్పారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో గురువారం సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావుతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి ఆకుల అనీష్ పరీక్ష సమయం ముగియకుండానే పేపర్ ఇన్విజిలేటర్‌కు ఇచ్చే విషయంలో విద్యార్థిని మందలించి మెడపట్టి తోసివేశాడు. విద్యార్థి ఏడుస్తూ ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులకు చెప్పాడు. దీంతో ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో పాఠశాల వద్దకు చేరుకుని ప్రిన్సిపాల్ రూమ్‌లో ఉన్న పరసా శ్రీధర్ అనే ఉపాధ్యాయుడిపై దాడి చేసి తీవ్రంగా కొట్టడంతో స్పృహతప్పి పడిపోయాడు. వెంటనే పాఠశాల యాజమాన్యం దగ్గరలోని ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం ఏలూరు ఆంధ్ర హాస్పిటల్‌కు తరలించారు. ఈ ఘటనలో ఉపాధ్యాయుడి సోదరుడి ఫిర్యాదు మేరకు ఆకుల ధర్మరాజు, ఆకుల గాంధీ, శీలం రాజా, ఆకుల మధుసూదనరావులను అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ చెప్పారు. బాధితుడు ఎస్సీ కులానికి చెందిన వ్యక్తి కావడంతో అట్రాసిటీ కేసు కూడా నమోదు చేసినట్లు తెలిపారు. అదే విధంగా విద్యార్థిని కొట్టిన సంఘటనలో ఉపాధ్యాయుడిపై కూడా కేసు నమోదు చేశామని వివరించారు. ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు పోలీసుల దృష్టికి తీసుకురావాలని, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోకూడదని డీఎస్పీ సూచించారు.

క్లుప్తంగా

ఆశీర్వాద కూడికల పోస్టర్ల ఆవిష్కరణ


పట్టణంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): యేసయ్య ఆశీర్వాద అభిషేక కూడికలు కొత్తగూడెం గ్రామంలో జీపీఎఫ్ఎం చర్చి ఆవరణలో ఈ నెల 24, 25, 26 తేదీల్లో జరగుతాయని వ్యవస్థాపకులు బిషప్ పి.సామ్యూల్ రాజు, మణి శ్యామ్‌లు వెల్లడించారు. సభల పోస్టర్లను పట్టణంలో రొక్కాల నాగబుజ్జి, మధుకుమార్, జాన్ బాబు, రోజా, ఆశీర్వాదం, బ్యూలలు ప్రార్థనలు అనంతరం ఆవిష్కరించారు. ప్రవక్త జిజో, జేమ్స్ అబ్రహం, గఫూర్, తదితరులు సభలలో ప్రసంగిస్తారన్నారు. సభలకు హాజరై దేవుని దీవెనలు పొందాలని విశ్వాసులకు విజ్ఞప్తి చేశారు.

ఎర్రయ్యమ్మ సేవలు మరువలేనివి


పూడి ఎర్రయ్యమ్మకు నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎర్రయ్యమ్మ సేవలు మరువలేనివని సీపీఐ పట్టణ క్యాదర్శి మండల నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని స్థానిక యాగర్లపల్లి వద్ద సీపీఐ నాయకురాలు కామ్రేడ్ పూడి ఎర్రయ్యమ్మ 13వ వర్ధంతి సందర్భంగా గురువారం ఆమె చిత్రపటానికి పార్టీ నాయకులు ఘన నివాళ్లులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూడి సుబ్బారావు, పూడి వెంకట్రావు, తూము సత్యనారాయణ, అల్లం రాము, రావూరి బాబీ, యూ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ చలం ఆధ్వర్యంలో గురువారం స్థానిక హౌసింగ్‌బోర్డు సెంటర్‌లోని సువర్చలా సమేత దక్షిణముఖ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి పట్టణంలో వివిధ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పి.పరమాత్మ, పి.బుచ్చిరెడ్డి, ఏఆర్‌కే సత్యనారాయణమూర్తి, బాకా వెంకటేశ్వరరావు, గురుమూర్తి, వీర బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

పేకేరులో ఉచిత వైద్య శిబిరం


పేకేరులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలోని పేకేరు గ్రామంలో గురువారం రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. తణుకు రెడ్డి సంఘం అధ్యక్షుడు కర్రి రామ చంద్రా రెడ్డి (చంటి) ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. తణుకు ఆరోగ్య హస్పిటల్ వారి సహాయ సహకారలతో వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో నిరుపేదలకు షుగర్, బీపీ, గుండెకు సంబంధించి ఇకో, ఈసీజీ, వంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సుమారు రెండు వందల మందికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు కోవ్వూరి శ్రీనివాసా రెడ్డి (బాబు), సత్తి అజయ్ రెడ్డి, చింతా బాపిరెడ్డి, నల్ల మిల్లి వెంకటరెడ్డి, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు పండ్ల పంపిణీ


పేద ముస్లింలకు పండ్లు, పంపిణీ చేస్తున్న అమ్మానాన్న సేవా సంస్థ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంజాన్ దీక్ష పవిత్రమైనదని వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ నౌషద్ మోహిద్దీన్ పేర్కొన్నారు. అమ్మానాన్న సేవా సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా గురువారం మసీద్‌లో పేద ముస్లింలకు పండ్లు, ఎనర్జి డ్రింక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అమ్మానాన్న సేవా సంస్థ అధ్యక్షుడు వద్రే కోటేశ్వరరావు, కార్యదర్శి మహ్మద్ కపర్ధి, మసీద్ పెద్దలు పాల్గొన్నారు.

‘ఆహో’రం.. ఆరోగ్యం..

- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లతో భరోసా
- లబ్ధిదారులకు పౌష్టికాహార పంపిణీ


ప్రత్తిపాడులో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం


పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహార విశిష్టతను వివరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

పెంటపాడు: అందరికీ ఆరోగ్యం.. అదే మహాభాగ్యం .. తద్వారా ఇంటింటి సౌభాగ్యం.. అందుకే అంగన్ వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల నుంచి వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తూ సత్ఫలితాలు సాధిస్తోంది. కొన్నేళ్ల క్రిందట గర్భిణులు, బాలింతలు పోషకాహారం తినకపోవడంతో ఆరోగ్యపరంగా ఇబ్బంది పడేవారు. ప్రసవ సమయంలో, ప్రసవానంతరం రక్త హీనతతో మృతి చెందేవారు. పుట్టే బిడ్డకు కూడా సంపూర్ణ పోషణ అందక అనారోగ్యాలు ముసురుకొనేవి. దీనిని దృష్టిలో పెట్టుకొని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలనే సదుద్దేశ్యంతో వైఎస్సార్ సంపూర్ణపోషణ పథకం, పోషణ్ పక్వాడా పథకాలు ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భాగంగా గర్భిణీగా నమోదైనప్పటి నుంచి ప్రసవనంతరం ఆరు నెలల వరకు నెలవారీ ఆరు రకాల పౌష్టికాహార పదార్థాలతో కిట్లు అందిస్తున్నారు. వీటితో పాటు, పోషక విలువలతో కూడిన భోజనాన్ని మధ్యాహ్నం అందిస్తున్నారు. భోజనానికి రానివారికి రోజుకో గుడ్డు, వారానికి లీటర్ పాలు సరఫరా చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతల ఆరోగ్యం ఎంతో మెరుగుపడుతోందని వైద్యులు చెబుతున్నారు. తాడేపల్లి గూడెం నియోజవర్గంలో 235 అంగనవాడే కేంద్రాలకు గాను 1490 మంది గర్భిణులు, 1625 మంది బాలింతలు ఉన్నారు.

వైఎస్సార్ సంపూర్ణ పోషణపథకం కిట్ ఇలా...

ఈ కిట్‌లో కేజీరాగి(చోడి)పిండి, కేజీ చిరుధాన్యాల పిండి, కేజీ అటుకులు, పావుకేజీ శనగ చిక్కి, పావుకేజీ బెల్లం, పావుకేజీ ఎండుఖర్జూరం, మొత్తంగా ఆరు రకాల ఆహార పదార్థాలు ఉంటాయి.

నాణ్యత బాగుంది


అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా ఇస్తున్న ఆరురకాల పదార్థాలు చాలా బాగున్నాయి. సక్రమంగా వాడుతున్నాను. వీటితో పాటు, గుడ్లు, పాలు ఇస్తున్నారు. పౌష్టికాహారం తినడం వల్ల నా ఆరోగ్యం మెరుగుపడింది. ఎనీమియా వల్ల రక్తహీనతతో బాధపడే నాకు ప్రభుత్వ సంపూర్ణ పోషణ వరంలా మారింది.

– మరిదా కుమారి, గర్భిణీ, పెంటపాడు

ప్రతి ఒక్కరూ వినియోగిస్తున్నారు


అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణాహార కిట్లు ఇస్తున్నాం. పౌష్టికాహారంపై అవగాహనలో భాగంగా సుమారు నెల రోజుల పాటు పోషణ పక్వాడా పేరుతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అవగాహన కల్పించాం. ప్రతి ఒక్కరూ ఈ కిట్లను సద్వినియోగం చేసుకొంటున్నారు.

– జి. శ్యామలాకుమారి, ఐసీడీఎస్ వర్కర్, పెంటపాడు

అర్హులందరికీ అందజేస్తున్నాం


ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశ్యంతో గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ పోషణ కిట్లు సరఫరాచేస్తోంది. వీటిని అర్హులందరికీ సకాలంలో అందజేస్తున్నాం. వాటిని లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఈ పథకం ద్వారా వారు అభివృద్ధి అభివృద్ధి సాధించి అనారోగ్యాలు లేని పండంటి బిడ్డకు జన్మనివ్వాలని కోరుతున్నాం.

– సీహెచ్ దుర్గా భవాని, సూపర్‌వైజర్, ఐసీడీఎస్ పెంటపాడు మండలం

మంచి ఆహార అలవాట్లతో మంచి ఆరోగ్యం

తణుకు టౌన్: మంచి ఆహార అలవాట్లతోనే మన ఆరోగ్యం ఆధారపడి ఉందని, వ్యాదుల నుంచి దూరం కావాలంటే ఆహారపు అలవాట్లను మార్పు చేసుకోవాలని సహజ సిద్ద ఆహార సంస్థ కాస్మోలైఫ్ యూనివర్సల్ ఎండీ జీ విష్ణు చెప్పారు. గురువారం తణుకు రూరల్ మండలం తేతలి గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన కాస్మోలైఫ్ యూనివర్సల్ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, అవగాహనా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ శిబిరంలో న్యూట్రిషన్ కన్సల్టెంట్ వేణు న్యూట్రిషన్ ఆహారం గురించి వివరించారు. ఈశిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి 20 రకాల పరీక్షలు నిర్వహించి వాటి రిపోర్టుల ఆధారంగా వారికి పలు సూచనలు, సలహాలను అందించారు. అనంతరం న్యూట్రిషన్‌కు సంబంధించిన వాటిని అందజేశారు. గ్రామ సర్పంచ్ సరెళ్ల కాంతి ప్రియ, ఉప సర్పంచ్ కోట నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు సరెళ్ల వీరతాత, కోట స్వామీజీ, సరెళ్ల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

తాడేపల్లిగూడెం: పాలిటెక్నిక్ కోర్సులో ప్రవేశానికి గాను మే పదోతేదీన జరుగనున్న ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత శిక్షణను ఇస్తున్నట్లు వాసవీ ఇంజనీరింగ్ కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావులు తెలిపారు. గూడెం, పరిసర ప్రాంత విద్యార్థులు వివరాలతో ఈ కోచింగ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 23వ తేదీలోపు స్వయంగా కలిసి పాలిసెట్ ఉచిత శిక్షణకోసం పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు పాలిటెక్నిక్ విభాగ కో ఆర్డినేటర్ జి.రామ్‌ప్రసాద్, 9505518243 నంబరుకు సంప్రదించాలన్నారు.

బీజేపీ వ్యతిరేక విధానాలపై ప్రచారభేరి


పట్టణంలో ప్రచార భేరి యాత్ర నిర్వహిస్తున్న నాయకులు


తాడేపల్లిగూడెం మండలంలో ప్రచార భేరి యాత్ర నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం, ఆల్ ఇండియా కమిటీల పిలుపు మేరకు ప్రజాపోరు యాత్రలో భాగంగా చేపట్టిన ప్రచార భేరి ఎస్వీ రంగారావు విగ్రహం నుంచి తాళ్ల ముదునూరుపాదు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు కర్రి నాగేశ్వరరావు, మండల నాగేశ్వరరావు, కరెడ్ల రామకృష్ణలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిత్యావసర ధరలను పెంచుతూ పేద, మధ్య తరగతుల జీవితాలను దుర్భరం చేస్తోందన్నారు. వేల కోట్ల రూపాయల ప్రజాదనాన్ని కార్పొరేట్ కంపెనీలకు దోచి పెడుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జవ్వాది శివ, టి.శ్రీను, షేక్ సాయిబన్, శిద్ధిరెడ్డి శేషు బాబు, అల్లం రాము, ధాస్యం రాము, బాబీ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార భేరి సభను జయప్రదం చేయండి

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణంలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన ప్రచార భేరి సభను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వెంకట్రావుపాలెం, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం, వీరంపాలెం, బంగారుగూడెం, కొత్తూరు, ఆరుగొలను, నవాబుపాలెం, పెద తాడేపల్లి, రామన్నగూడెం, వెంకట్రామన్నగూడెం, కృష్ణాయపాలెం, ఆరుళ్ళ, మారంపల్లి, నందమూరు గ్రామాల్లో ప్రచార భేరి యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు కండెల్లి సోమరాజు, సీపీఐ నాయకుడు ఉల్లింకల జయకృష్ణ మాట్లాడుతూ ఉపాధి చట్టం రావడానికి వామపక్ష పార్టీల కృషి ఉందని, నేడు మోదీ ప్రభుత్వం ఈ చట్టాన్ని గొంతు నులిమే ప్రయత్నం చేస్తుందన్నారు. దీనిని కూలీలంతా నిలబెట్టుకోవాల్సిన అవసరం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో కండెల్లి రమేష్‌బాబు, ఉల్లింకల బాలకృష్ణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి


వార్డులో పరిసరాల పరిశుభ్రతపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ వై.వి.లక్ష్మణరావు అన్నారు. గురువారం పట్టణంలోని 9, 10, 11, 22 వార్డుల్లో జరుగుతున్న ఫీవర్ సర్వే, కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ దోమల నివారణకు దోమ తెరలు వాడాలని, ఇంటిలోపల, బయట నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు పోసమ్మ, మంగతాయారు, మేరి, సహాయకులు కాంతారావు, ఆశాలు, వార్డు వాలంటీర్లు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోదీ పాలనలో దేశం అధోగతి


తణుకులో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం

తణుకు: దేశానికి మంచి రోజులు తీసుకువస్తానని మాయమాటలు చెప్పిన మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా ప్రజలను చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఎం జిల్లా కార్యదర్శి బలరాం అన్నారు. వామపక్షాలు ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న ప్రచారభేరి యాత్ర నియోజకవర్గ స్థాయి ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ గద్దెనెక్కిన నాటి నుంచి ప్రజలపై మోయలేని భారాలు మోపుతోందని విమర్శించారు. గ్యాస్, పెట్రోలు, డీజిల్, విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరిచిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ ప్రజా సంపదను దోచిపెడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం పట్టణ కార్యదర్శులు బొద్దాని నాగరాజు, పీవీ ప్రతాప్, సికిలే పుష్పకుమారి, నామన వెంకటేశ్వరరావు, గుబ్బల వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ, బండి సత్యనారాయణ, పెండ్యాల దత్తాత్రేయప్రసాద్, బొద్దాని కృష్ణకిశోర్, గార ప్రసాద్, పుట్టా అమ్మిరాజు, నమ్మి రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు తాడేపల్లిగూడెంలో బీజేపీకి వ్యతిరేకంగా బహిరంగసభ

సాక్షి, భీమవరం: కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 21వ తేదిన తాడేపల్లిగూడెంలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు బి బలరాం, కె భీమారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిధులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సిహెచ్ బాబురావు పాల్గొంటారన్నారు. దేశాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అన్నిరంగాల్లో దివాళా తీయించిదన్నారు. ముగింపు ప్రచారభేరి సందర్భంగా తాడేపల్లిగూడెం మెయిన్ రోడ్‌లోని ఎన్‌కే గ్రౌండ్‌లో శుక్రవారం ఉదయం 8 గంటలలకు బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సభకు పార్టీ సభ్యులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలన్నారు.

పేద కళాకారులకు సేవలు అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేద కళాకారులకు సేవలు అందించడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బీవీఆర్ కళాకేంద్రంలో వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమంలో భాగంగా ఆకుతీగపాడు గ్రామ సర్పంచ్ దాసం వెంకటేశ్వర్లు దంపతులను సత్కరించారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న యదవల్లి వినయవర్ధన్‌కు దాతలు అందించిన రూ 50 వేలు ఆర్థిక సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఈతకోట తాతాజీ, జిల్లా వ్యవసాయ మండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ పెంటపాడు మండల శాఖ అధ్యక్షుడు నల్లమిల్లి అంజిరెడ్డి, ఆకుతీగపాడు మాజీ సర్పంచ్ బుద్దన ధనరాజు, బీవీఆర్ కళా కేంద్రం గౌరవ సలహాదారు కొడవటిగంటి వెంకట నరసింహచార్యులు, కోటి విజయ కిషోర్, డాక్టర్ చిట్యాల సురేంద్ర, పీటీ వెంకన్న, కళాకారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు


తాడేపల్లిగూడెం ఏడీఏ పి.మురళీకృష్ణ

తాడేపల్లిగూడెం రూరల్: దాళ్వా సీజన్ పూర్తి కావడంతో రైతులు తమ పొలాల్లో పచ్చిరొట్ట పైర్లు సాగుకు సబ్సిడీపై విత్తనాలు అందిస్తున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకులు పి.మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. పచ్చిరొట్ట పైర్లు పెంచి వాటిని దుక్కిలో దున్నుకోవడం వల్ల ఎరువుల వినియోగం తగ్గించవచ్చన్నారు. పిల్లిపెసర కిలో రూ.97లు, జనుము కిలో రూ.84లు కాగా, 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించనున్నట్టు తెలిపారు. 60.8 క్వింటాళ్ల పిల్లిపెసర, 3.0 క్వింటాళ్లు జనుము విత్తనాలు ఆర్‌బీకేల్లో ఉన్నాయన్నారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి కొత్తగా రైతు భరోసా కావలసిన రైతులు పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఏడీఏ పి.మురళీకృష్ణ కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


జగనన్న పథకాలు ప్రచారం చేస్తున్న ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు తదితరులు

పెంటపాడు: ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తోందని పెంటపాడు ఎంపీటీసీ సభ్యుడు రెడ్డి సూరిబాబు తెలిపారు. పెంటపాడులో గురువారం జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి ప్రచారంలో భాగంగా ప్రజలకు అందిన పథకాలు వివరించారు. ప్రతి ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు బర్ల జయరాంబాబు, రెడ్డి శ్రీను, బండారు తదితరులతో పాటు గృహసారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్‌తోనే రాష్ట్రానికి బంగారు భవిష్యత్

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే బంగారు భవిష్యత్ సాధ్యపడుతుందని రైతు భరోసా కేంద్రం చైర్మన్ ములగాన గంగారావు అన్నారు. గురువారం మండలంలోని దండగర్ర గ్రామంలో జగనన్న మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగారావు మాట్లాడుతూ జగనన్న మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందన్నారు. ఇంటింటికి వెళ్లిన సందర్భంలో ప్రజలు తమను ఎంతో ఆప్యాయతతో స్వాగతిస్తున్నారని, ఇంతకంటే సీఎం జగన్ సంక్షేమ పాలనకు నిదర్శనం ఏమిటని ప్రశ్నించారు. జగన్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బాసటగా నిలిచి తిరిగి సీఎంను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ యాతం సత్యనారాయణ (పెద్దోడు), ములకాల శ్రీను, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు. అలాగే, వెంకట్రావుపాలెంలో సర్పంచ్ ఎలిపే గాంధీ, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, మాధవరంలో సొసైటీ చైర్మన్ జద్దు హరిబాబు, తారమట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన టెక్నాలజీపై శిక్షణ

సాక్షి, భీమవరం: నూతన టెక్నాలజీతో విద్యా, ఉపాధి రంగాల్లో వచ్చే మార్పులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేయాలని స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతి రాజు అన్నారు. కళాశాల టెక్నాలజీ సెంటర్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ సంయుక్త ఆధ్వర్యంలో ఫ్రీడం ఫెస్ట్ పేరిట నిర్వహించిన వర్క్‌షాప్‌లో గురువారం ఆయన మాట్లాడారు. తమ కళాశాలతోపాటు పట్టణంలోని ఇంజినీరింగ్ కళాశాల నుంచి సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టెక్నాలజీ సెంటర్ హెడ్ ఎం.గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రజల భద్రతలో ఫైర్ సిబ్బంది సేవలు అమూల్యం

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు


తణుకులో ఫైర్ సిబ్బందికి యూనిఫాం అందజేస్తున్న అధికారులు


అత్తిలిలో అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న ఫైర్ ఆఫీసర్ రాజన్‌రాజు

తణుకు: ప్రజల భద్రత విషయంలో ఫైర్ సిబ్బంది సేవలు ఎంతో కీలకమని తణుకు మున్సిపల్ కమిషనర్ టి.సుధాకర్ అన్నారు. తణుకు అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. అగ్నిమాపక అధికారి ఐ.అజయ్‌కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమంలో కమిషనర్ సుధాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సరిహద్దులో జవాన్ల మాదిరిగా అనునిత్యం అప్రమత్తంగా ఉండే శాఖ అగ్నిమాపక శాఖలోని సిబ్బంది అని అన్నారు. మండల తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ మాట్లాడుతూ ప్రాణాలు లెక్కచేయకుండా ఎలాంటి విపత్తులు అయినా ఎదుర్కొనేందుకు నిత్యం అందుబాటులో ఉంటారని చెప్పారు. కేవలం ఏడాదిలో వారోత్సవాలు మాత్రమే కాకుండా ప్రతినెలా అవగాహన పేరుతో ప్రజలకు అగ్నిప్రమాదాల నివారణపై సదస్సులు ఏర్పాటు చేస్తూ ఉండాలని ఎంపీడీవో టి.సూర్యనారాయణమూర్తి అన్నారు. నరేష్ క్లాత్‌షోరూం అధినేత రాకేష్‌కుమార్ అగర్వాల్ సహకారంతో ఫైర్ సిబ్బందికి యూనిఫాం అందజేశారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బందికి ఎలాంటి సహకారం కావాలన్నా తాను సిద్ధంగా ఉంటానని పేర్కొన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన సిబ్బందిని అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మేన్‌లు జీడీఈవీ ప్రసాద్, కేవీ అప్పారావు, ఎ.అప్పారావు, డ్రైవర్ ఆపరేటర్లు ఎం.వెంకటేశ్వరరావు, ఎస్.అచ్చిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

అత్తిలి: అగ్నిప్రమాద నివారణా పద్ధతులు పాటించడం ద్వారా ఆస్థి, ప్రాణనష్టాన్ని కాపాడుకోవచ్చని అత్తిలి అగ్నిమాపక అధికారి సీహెచ్ రాజన్‌రాజు చెప్పారు. అగ్నిమాపక వారోత్సవాలు ముగింపు సందర్భంగా గురువారం అత్తిలి అగ్నిమాపక కేంద్రంలో ఏర్పాటు చేసిన ముగింపు సమావేశానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఫైర్ ఆఫీసర్ రాజంరాజు మాట్లాడుతూ అగ్నిప్రమాదాలు అధికంగా అజాగ్రత్తల వల్లే జరుగుతాయని, వాటిని అధిగమిస్తే ప్రమాదాలు జరగవన్నారు. విద్యుత్, గ్యాస్ పరికరాల వినియోగంపట్ల ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు అధికంగా జరిగే అవకాశం ఉన్నందున ప్రమాదాలు జరకకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. వారోత్సవాలు సందర్భంగా వారం రోజులుగా అగ్నిమాపక దళం నిర్వహించిన కార్యక్రమాలను ఆయన వివరించారు. అగ్ని ప్రమాద సమయంలోనే కాకుండా ప్రకృతి విపత్తులు సమయంలో చేస్తున్న సేవలను పలువురు ప్రముఖులు శ్లాఘించారు. అత్తిలి హెచ్‌పీ గ్యాస్ కంపెనీ అధినేత గుడిమెట్ల గంగాధర రెడ్డి మాట్లాడుతూ గ్యాస్ ప్రమాదాల సమయంలో వారి ప్రాణాలు కూడా లెక్కచేయకుండా ఎదురెల్లి ప్రాణ, ఆస్తి నష్టాలను నివారిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వెల్డింగ్‌షాపు యజమాని మంతెన భాస్కర రావు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.